# ఖజానా

"రండి...రండి... ఇన్నాళ్ళకైనా మేం గుర్తుకు వచ్చాం! ఆమధ్య ఈ వీధిలోకి వచ్చి కూడా మా ఇంటికి రాలేదు. అంతేలెండి... ఎవరికైనా మేడల్లో మిద్దెల్లో ఉంటున్నవాళ్ల దగ్గరకు వెళ్ళాలనిపిస్తుందిగానీ ఇలాంటి ఇరుకు కొంపల్లో మగ్గుతున్న వాళ్ళని పరామర్శించాలని ఎందుకుంటుందిలెండి!"

"... ..."

"అదేంకాదని మాటవరసకంటారుగానీ మర్యాదా మన్ననా అన్నీ డబ్బున్నవాళ్ళకే దక్కుతాయి. ఈ సంగతి ఈ రోజుల్లో చిన్న పిల్లలక్కూడా తెలుస్తోంది కానీ... ఇదిగో గుండ్రాయిలా కూర్చున్న మా మహానుభావుడికి మాత్రం అర్థం కాలేదు! నిన్న మొన్నటి వరకూ రోడ్లమీద చిత్తు కాగితాలేరుకున్న వాళ్లు కూడా ఇపుడు కార్లలో తిరుగుతూంటే... ఈయనేమో చేతకాని వ్యాపారం చేసి అప్పులకి ఇల్లూ వాకిలీ తెగనమ్మి.... మమ్మల్నిలా రోడ్డు మీద నిలబెట్టినట్లుగా చేశాడు!"

"... ..."

"ఏం చేయకపోవటమేమిట్లెండి... ఇంటెడి చాకిరితో నేను ఒళ్ళు హూనం చేసుకుని వండి వారుస్తుంటే మూడు పూటలా తినిపెడుతున్నారు. ప్రస్తుతం అదేపని. అసలు తప్పంతా

మా అమ్మా వాళ్ళదే! ఎన్ని మంచి సంబంధాలొచ్చినా కాదనుకుని ఈయనకు కట్టబెట్టి చేతులు దులిపేసుకున్నారు. నా ఖర్మానికి నన్నొదిలేసి వాళ్ళేమో పైకెళ్లిపోయి సుఖపడిపోయారు. ఏం చేస్తాం... నా తలరాత ఇలా తగలడింది..."

మా పక్కవాటాలోని వనజాక్షిగారి వాక్ప్రవాహం అలా సాగిపోతూనే ఉంది. వాళ్ళింటికి బంధువులుగానీ, స్నేహితులుగానీ ఎవరొచ్చినా స్వాగత వచనాలు ఆ ధోరణిలోనే ఉంటాయి. వాళ్ళకీ మాకూ కామన్‌గా ఉన్న వరండాలో చిన్న పార్టిషన్ మాత్రమే ఉంది. అందుకే వరండాలో కూర్చుంటే వాళ్ళింట్లోని మాటలన్నీ వినబడుతుంటాయి. ఆపైన ఆమె గొంతు కూడా చిన్నది కాదుమరి!

కుర్చీలోంచి లేచి చదువుతున్న పేపరును చేతపుచ్చుకుని లోపలకు వచ్చి తలుపు వేసేసుకున్నాను. ఆవిడ సూటిపోటీ మాటల్ని వింటోంటే నాకే ఎలాగో ఉంటుంది. పాపం ఆయన ఎలా తట్టుకుంటున్నాడో అనిపిస్తుంది. ఆయన మాత్రం ఎపుడూ నోరెత్తి జవాబు చెప్పినట్లుగా వినిపించదు. ఈ ప్రపంచంతో సంబంధం తెంచేసుకున్నట్లుగా నిర్లిప్తంగా కూర్చొని వుంటాడు. ఆయనలా మారిపోయినందుకే ఆవిడ ఉక్రోషంతో చెలరేగిపోతూంటుందో... లేక ఆవిడ ధోరణివల్లే ఆయనలా మారిపోయాడో అన్నది నాకు అంతుపట్టని విషయం!

వ్యాపారంలో వచ్చిన నష్టానికి సొంత ఇంటిని అమ్మేసి అప్పులన్నీ తీర్చి మా పక్కవాటాలోకి మూడు నెలల క్రితం అద్దెకు దిగారు వాళ్ళు. పిల్లలు వేరే ఊళ్ళో చదువుకుంటున్నారట. ఎవరైనా వచ్చినపుడే కాదు, రోజూ ఏదో ఒక సందర్భంలో ఆవిడ ఆయన్ను ఎత్తిపొడుస్తూనే ఉంటుంది. ఒకరోజు ఉండబట్టలేక మా సుగుణ ఒక మాట అంది.

"తాగుడుకో, పేకాటకో ఆస్తుల్ని తగలేసినవాళ్ళని తప్పు పట్టొచ్చుగానీ వ్యాపారంలో వచ్చిన నష్టానికి పాపం ఆయన మాత్రం ఏం చేస్తారూ.... కావాలని చేసింది కాదుగా!" అని.

అంతే, ఆవిడ గయ్‌మని లేచింది.

"ఈత రానివాడు ఒడ్డునే నిలబడాలిగానీ తగుదునమ్మా అంటూ ఏట్లోకి గెంతటమెందుకూ మమ్మల్ని నిలువునా ముంచటానికి కాకపోతే. ఉద్యోగమే చేసుకుంటూ ఉండొచ్చుగా... చేతగాని వ్యాపారాల్లో చేయి పెట్టమని ఎవరేడ్చారూ?"

అంతేగాదు, ఆ రోజంతా మాకు వినడేట్లుగా "ఒడ్డున నిశ్చింతగా నిలబడి చూస్తున్న వాళ్లకి ఏం అర్థం అవుతుందీ, నిండా మునిగిన వాళ్ళ బాధ! పాపం అంట.... పాపం..." అంటూ నసుగుతూనే ఉంది. అదీ నిజమేనేమో... ఒకరి బాధలు ఇంకొకరికి అర్థం కాకపోవచ్చు.

ఇక అప్పటినుండీ ఆవిడ ఎదురుపడినపుడు ముక్తసరిగా పలుకరించి ఊరుకోవటం, ఆవిడ చెప్పే కబుర్లను మారుమాట్లాడకుండా వినటం సుగుణ అలవాటు చేసుకుంది. పక్కింటాయన గురించి ఆలోచిస్తుంటే నాకు సడన్‌గా సత్యం గుర్తుకు వచ్చాడు. చదువుకునే

రోజుల్లో నాకున్న స్నేహితుల్లో వాడే ముఖ్యుడు.  వి.ఆర్.ఎస్ తీసుకున్నాక వచ్చిన డబ్బుతో సొంత ఊరు వరంగల్‌లో కట్టించుకున్న ఇంటిని గృహప్రవేశం కాకుండానే అమ్మి అప్పులు తీర్చాల్సిన పరిస్థితి వాడికీ వచ్చింది. సత్యం సొంతంగా వ్యాపారం చేయలేదుగానీ ఒక స్నేహితుడి వల్ల వాడికలాంటి దుస్థితి దాపురించింది.

వరంగల్‌లో సత్యానికి బాగా తెలిసిన కృష్ణారావు తిరుపతి వెళ్ళి సెటిలయి ఏవో వ్యాపారాలు చేసి బాగా సంపాదించాడు.  ఆయనకు కోట్లలో ఖరీదు చేసే ఇళ్ళ స్థలాలూ, రెండు మూడు బిల్డింగులూ అన్నీ ఉన్నాయి. ఆయన కొత్తగా ప్రారంభించిన ఇండస్ట్రీ నిర్మాణం ఇబ్బందులతో మధ్యలో ఆగిపోవటంతో వరంగల్ వచ్చి సత్యానికి తన సమస్యలు చెప్పుకొని ఎలాగైనా గట్టెక్కించాల్సిందేనని బాగా మొహమాటపెట్టాడు. 'వడ్డీ ఎంతయినా పర్వాలేదు, బ్యాంకు లోను రాగానే నాలుగైదు నెలలలోపే తీర్చేస్తానని చెప్పటంతో సత్యం తన పరపతినుపయోగించి తానే హామీగా ఉండి నలుగురైదుగురి దగ్గర అప్పుగా పెద్ద మొత్తం లక్షల్లో సమకూర్చాడు. సత్యానికి ఉద్యోగమే తప్ప వేరే ఆస్తిపాస్తులేం లేవు మరి.

అతను చెప్పిన గడువు గడిచిపోయింది. రోజులూ జరిగిపోయాయి. అతని ఇండస్ట్రీ పూర్తవటం, ఏవో కారణాలవల్ల లాభానికి అమ్మేసుకోవటం కూడా జరిగిపోయిందిగానీ సత్యం బాకీ మాత్రం పూర్తిగా తీర్చలేదు. అపుడప్పుడూ కొంచెం కొంచెంగా కొంత మాత్రమే ఇచ్చాడు. మాటప్రకారం వడ్డీలతో సహా తీర్చటానికి సత్యం ఇంకొకరి దగ్గర తీసుకుని ఇంకొకరికి జమ చేస్తూ అలా అప్పులు చేయాల్సి వచ్చింది. ఏవో తాత్కాలిక ఇబ్బందులు వచ్చినాగానీ కృష్ణారావు కోటీశ్వరుడే కాబట్టి తీర్చకపోతాడా అని సత్యం అనుకున్నాడు. కానీ ఆ నమ్మకం వమ్ము అయింది. ఆస్తుల్ని తనఖా పెట్టుకున్నవాళ్ళ అప్పుల్ని తీర్చాడుగానీ మాట నమ్మకం మీద తాను హామీ ఉండి ఇప్పించిన సత్యానికి కృష్ణారావు మొహం చాటేశాడు. అతనికోసం తిరగటంలో ప్రయాణం ఖర్చులూ ఫోను బిల్లులూ పెరిగాయి. సంవత్సరాలు గడుస్తోంటే వడ్డీతో కలిసి అప్పు పెరిగిపోతూండటంతో, మాట పోగొట్టుకోవటం ఇష్టం లేక ఇంటిని అమ్మేసి అప్పులన్నీ తీర్చేశానని సత్యమే నాకు నాలుగైదు నెలల క్రితం ఫోనులో చెప్పాడు.

ఆ తరువాత అద్దె తక్కువని, ఊరికి దూరంగా ఉన్న కాలనీకి మారాడని సత్యం అడ్రసు ఇంకొక స్నేహితుడు ఇచ్చాడుగానీ ఫోను నంబరు తెలియదని చెప్పాడు.

ఈ రోజెందుకో సత్యం గుర్తుకువచ్చాడు. సత్యం భార్య వసుమతి నాకు బాగా తెలుసు. మంచి మనిషే. పరిస్థితులు సవ్యంగా ఉన్నపుడు బాగానే ఉండొచ్చు. ఒడుదొడుకులు ఏర్పడినప్పుడే ఎవరెలా ప్రవర్తిస్తారో తెలుస్తుంది.

ఉద్యోగం చేసినన్నాళ్లు పొదుపు చేసిన డబ్బుతో కట్టుకున్న కొత్త ఇంటిని ఎవరో ఫ్రెండు చేసిన మోసానికి అమ్ముకోవాల్సి వచ్చినందుకు వసుమతి కూడా సత్యాన్ని వనజాక్షిగారిలా నిత్యం సాధిస్తూంటూందా...?  అలా జరిగితే సత్యంలాంటి సున్నిత మనస్కుడు తట్టుకోగలడా? పక్కింటాయనలా జీవచ్ఛవంలా మారిపోతాడా...?

మనసులో ఏదో ఆందోళన ప్రారంభమైంది. అప్పుల కోసం ఉన్న ఆస్తినంతా పోగొట్టుకున్న దురదృష్టకర పరిస్థితుల్లో ఉన్న సత్యాన్ని చూసి రావాలని నాకెందుకు తోచలేదు? నన్ను నేనే నిందించుకున్నాను.

"ఏమిటంత దీర్ఘాలోచన?" వంటగదిలో నుంచి వచ్చిన సుగుణ అడిగింది.

"వనజాక్షిగారింటికి ఎవరో వచ్చినట్టున్నారుగా, ఆవిడ గొంతు పెద్దగా వినిపిస్తోంది. ఆయన చేసిన నిర్వాకమంటూ అందరికీ అలా చెప్పుకొన్నందువల్ల ఆవిడకి ఒరిగేదేమిటో నాకర్థం కాదు!" నిట్టూర్చింది.

"సంపాదన లేని మగవాడిని ఆడవాళ్ళెంత హీనంగా చూస్తారో ఈవిడను చూశాకే తెలిసింది".

నా మాటలకు సుగుణ నావేపు ఉరుముతూ చూసింది. "ఎవరో ఒకరు అలా ప్రవర్తించినంత మాత్రాన ఆడవాళ్ళనందర్నీ ఒకేగాటన కట్టి అలా మాట్లాడొచ్చా? కట్నాల కోసం పెళ్ళాల్ని కిరసనాయిలు పోసి తగలపెట్టిన మగవాళ్ళ గురించిన వార్తల్ని చదివి మగవాళ్ళంతా అంతే అని నేనంటే మీకెలా ఉంటుందీ?" పాయింటు తీసింది.

మాటకు మాట అప్పచెప్పటంలో క్షణం కూడా ఆలస్యం చేయదు.

"నేనేదో మాటవరసకనగానే అంత రాద్ధాంతం చేయాలా?" అని నేననగానే "దీన్ని రాద్ధాంతం చేయటం అంటారా?" అంటూ మొదలుపెట్టింది.

మా వాదోపవాదాలు మరికాసేపు సాగేయేకానీ ఫోన్ మోగటంతో ఫుల్‌స్టాప్ పడింది. సుగుణ లేచివెళ్ళి మాట్లాడింది. నాలుగు నిమిషాల తర్వాత వచ్చి నా ఎదురుగా కూర్చుని దిగులుగా మొహంపెట్టి చెప్పింది. "కాకినాడలో అన్నయ్యా వాళ్ళింటికి దగ్గర్లోనే వదిన దూరపు బంధువు సుదర్శన్‌రావుగారుండే వాళ్ళు, మీకూ తెలుసుగా... ఆ మధ్య మనం వెళ్ళినపుడు అన్నయ్య వాళ్లనీ భోజనానికి పిలిచాడు గుర్తుందా? వాళ్లకి ఊళ్ళో రెండు మూడుచోట్ల పెద్దపెద్దవి సూపర్ మార్కెట్లున్నాయి. బిజినెస్ బాగానే జరుగుతోందని అనుకునేవాళ్ళు. మరి పొరపాట్లు ఎలా జరిగాయో ఏమిటో, అప్పులు బాగా పెరిగిపోయాయట! ఆస్తంతా అప్పులకే సరిపోతుంటే ఇక బతకటం దేనికనుకున్నాడు కాబోలు మొన్నరాత్రి కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి భార్యకీ ఇద్దరు కొడుకులకీ ఇచ్చి తానూ తాగేశాడట! ఇప్పుడు వాళ్ళందరూ హాస్పిటల్‌లో కొన ఊపిరితో ఉన్నారనీ బతికి బయట పడటం కష్టమేనంటున్నారనీ వదిన చెబుతోంది. వారం రోజుల నుంచీ వాళ్ళింట్లో అందరూ పెద్దపెద్దగా అరుచుకోవటం వినిపించేదని ఇరుగూ పొరుగూ వాళ్లు చెప్పారట!"

నేను మనసులోనే ఉలిక్కిపడ్డాను. సత్యం... వాడు కూడా ఏదో ఒక బలహీన క్షణంలో ఇలాంటి నిర్ణయం తీసుకోడుగదా...?

మనసులో మళ్ళీ ఆందోళన ప్రారంభమైంది.

నేను రెండునెలల క్రితమే రిటైరయ్యాను. పెద్దబ్బాయికి చదువు పూర్తవగానే ఇక్కడే ఉద్యోగం వచ్చింది. రెండోవాడి చదువు కూడా ఈ సంవత్సరంతో పూర్తవుతుంది. సమస్యలేమీ లేకుండా నేను సెటిలైనట్లే. ఒక ఫ్లాటు తీసుకొన్నాను. దానికి ఉడ్‌వర్క్ చేయించే పనుల్లో ఈ రెండు నెలలుగా బిజీగా ఉండటం వల్లనే సత్యం దగ్గరకు వెళ్లి రావాలనే ఆలోచన రాలేదు. ఇక ఆలస్యం చేయకుండా ఇప్పుడైనా వెళ్లి రావాలి. నాకు బ్యాంకులో బాలెన్సు ఫరవాలేదు. బాగానే ఉంది. సత్యం పిల్లలిద్దరి చదువులూ ఇంకా పూర్తి కాలేదు. చదువులకైనా, సత్యం ఏదైనా బిజినెస్ చేయాలనుకున్నా నేనివ్వగలనని చెప్పాలి.

"ఏమిటలా మళ్ళీ ఆలోచనలో పడిపోయారూ?"

సుగుణ మాటలకు తెప్పరిల్లి "సత్యం గురించి .... ఏమిటో ఈ రోజంతా వాడి గురించిన ఆలోచనలే" అన్నాను.

"ఒకసారెళ్ళి చూసొస్తే బావుంటుంది. వచ్చే నెలలో గృహప్రవేశానికి స్వయంగా పిలిచినట్లూ ఉంటుంది. డబ్బు కూడా అవసరమేమో కనుక్కోండి" అంది సుగుణ.

నా మనసులోని మాటలనే తను కూడా చెప్పేసరికి నాకు ఆనందంగా అనిపించింది. ఆలస్యం చేయకుండా మరునాడు ఉదయమే బయలు దేరాను.

ఊరికి బాగా దూరంగా ఉన్న ఆ కాలనీకి వెళ్ళేసరికి మధ్యాహ్నం రెండు గంటలు దాటింది. అక్కడ కాలనీ రూపుదిద్దుకోవటానికి ఇంకో అయిదారేళ్లు పైనే పట్టొచ్చు. అక్కడొకటి అక్కడొకటిగా విసిరేసినట్లుగా ఓ పది పన్నెండు ఇళ్ళున్నాయంతే.

సత్యం ఉంటున్న ఇల్లు కూడా సగంలో ఆపివేసినట్లుగా అసంపూర్తిగా ఉంది. తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. అలికిడేం లేదు. లోపలకు నేను నాలుగడుగులు వేయగానే నవ్వులు వినిపించి అటువైపు చూశాను. ఆ పక్కగదిలో వాళ్ళందరూ భోజనాలకు కూర్చుంటున్నారు.

నన్ను చూసి సత్యం "ఎప్పుడొచ్చావురా" అంటూ నవ్వు మొహంతో ఎదురొచ్చాడు.

"అందరూ లోపలెక్కడో ఉండీ... తలుపులేమిటి అలా బార్లా తెరిచి ఉంచారూ?" అంటే,

"దాచుకోవటానికేమీ లేకపోతే తలుపు లేసుకునే పనికూడా ఉండదు చూశావా" అంటూ నవ్వాడు.

వసుమతినాకు ప్లేటు పెడుతుంటే "దారిలో తిన్నాను ... కొంచెం పెట్టమ్మా" అన్నాను.

"మా ఇంట్లో నాన్‌వెజ్ ఉండకపోయినా తాజా కాయగూరలతో రాజా భోజనం! మొదలు పెట్టావంటే ఇంకా ఇంకా అంటావ్" అన్నాడు సత్యం ఛలోక్తిగా.

ఆ మాటలు నిజమేననిపించాయి. వండే పద్ధతిలో ఉందో లేక పెరట్లో పెంచిన కాయగూరల వల్లనో ఏమోగానీ కూరలన్నీ చాలా రుచిగా ఉన్నాయి.

సాయంకాలంపూట సత్యం నేనూ వరండాలో కూర్చున్నపుడు "ఇంటి వెనుకా పక్కనా కూరగాయల పాదులు పెట్టారు. ముందైనా అందానికి నాలుగు పూలమొక్కలు వేయొచ్చుగా?" యథాలాపంగా అడిగాను.

"కంటికింపుగా ఉండే వాటి గురించిన ఆలోచనలేం లేవు బాబూ... ప్రస్తుతానికి కడుపు నింపేవాటికే ప్రాముఖ్యత" అంటూ నవ్వాడు.

వాడు అలా సరదాకి అన్నా నాకు మనసు చివుక్కుమంది. ఇలాంటి పరిస్థితి వాడి స్వయంకృతాపరాధమేగా! అద్దె తక్కువని ఊరికింత దూరంగా వచ్చి పడ్డాడు. ఎక్కడికి వెళ్ళాలన్నా బస్‌స్టాప్‌కి మైలుదూరం నడవాల్సిందే. కాలక్షేపానికి ఇంట్లో టీవీ అయినా లేదు. పిల్లలిద్దరూ కూడా తమ చదువులతోపాటు ట్యూషన్లూ చెబుతూ సంపాదించాల్సి వచ్చింది. వీడి దుస్థితి ఇలా వుంటే ఆ కృష్ణారావు మాత్రం బాగానే ఉన్నాడు. ఇప్పటికీ అతను కోటీశ్వరుడే.

నా ఆవేశాన్నీ కోపాన్నీ మాటల్లో వెళ్ళగక్కుతూంటే, మధ్యలో అడ్డం రాకుండా చిరునవ్వుతో విని తర్వాత నిదానంగా చెప్పాడు.

"నిజమే, నేను చేసింది చాలా పెద్ద పొరపాటే. స్నేహధర్మంగా సహాయం చేస్తున్నానని అనుకున్నానుగానీ ఇలా జరగొచ్చని ఊహించలేకపోయాను. అతనిలా నేనూ అందరికీ ఎంతో కొంత ఇచ్చి చేతులేత్తేయొచ్చు. మాట, పరువు పోయినా ఆస్తిని నిలబెట్టుకోవటమే ముఖ్యమని అనుకోలేకపోయాను. నా పిల్లల శక్తి సామర్థ్యాలపట్ల నాకు నమ్మకం ఉంది. వాళ్ళ భవిష్యత్తు గురించి నాకేం బెంగలేదు. కృష్ణారావుకి మాత్రం తన పిల్లల భవిష్యత్తులపట్ల భరోసా లేదు. వాళ్ళకోసం ఆస్తుల్ని పదిలంగా కాపాడాలనే తాపత్రయంలో నాలాంటి వాళ్ళకి మొహం చూపించకుండా, నలుగురిలోకి రాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు... అతనిదిరా దుస్థితి అంటే! అలాంటి దౌర్భాగ్యం లేకుండా నాకేం దర్జాగా, నిశ్చింతగా ఉన్నాను! ట్యూటోరియల్ కాలేజీలో ఒక పూట క్లాసులు తీసుకుంటున్నందువల్లే టీచింగ్ పట్ల నాకెప్పటినుంచో ఉన్న సరదా ఇప్పుడు తీరుతోంది. వసుమతికీ అంతే. తను నేర్చుకున్న విద్యకి సార్థకత వచ్చిందనీ కళాకేంద్రంలోని పిల్లలకి సంగీతం నేర్పించటంతోపాటూ ఇన్నాళ్లకి హాయిగా గొంతెత్తి పాడుకోగలుగుతున్నానని ఆనందిస్తోంది. పిల్లలిద్దరూ కూడా కాసేపు ట్యూషన్స్ చెప్పటం వల్ల వాళ్లకీ సబ్జెక్ట్‌లో నాలెడ్జి పెరుగుతుంది. మాకిష్టమైన మార్గాల్లోనే ఉపాధి వెతుక్కుంటున్నందువల్లనేమో మాకేమీ కష్టంగా అనిపించటం లేదు. బాగానేఉంది. కాలం పరుగులు పెడుతున్నట్లుగా గడిచిపోతోంటే కాలక్షేపానికి టీవీచూసే టైమెవరికుందిరా? తోటపని, నడకతో మునపటికంటే నేను ఆరోగ్యంగా కనుపించటం లేదూ? నిజం చెప్పు..."

ఆ మాట నిజమే... కాదనటానికి లేదు. వాడివేపు సంభ్రమంగా చూస్తుండిపోయాను.

"ఉద్యోగం చేసినన్నాళ్ళు ఆదా చేసిందంతా పోగొట్టుకున్నానని అనుకుంటున్నావు గానీ నేను సంపాదించుకున్నది.... విలువైనది ఇంకా మిగిలే ఉంది! కష్టసమయంలో అండగా

నిలబడాలని నీ అంతట నువ్వే నన్ను వెతుక్కుంటూ వచ్చావ్. నీ సేవింగ్స్‌నీ ఇవ్వటానికి సిద్ధపడ్డావ్. ఇది చాలదూ... ఇంకేం కావాలిరా నాకు" అన్నాడు అప్యాయంగా నా చేతిని పట్టుకుని.

నాకు ఒళ్ళు పులకరించింది. మనసు ఆర్ద్రమైంది.

ఆ ఆత్మీయ స్పర్శను ఆస్వాదిస్తూ... ఏం మాట్లాడలేని ఆనందకరమైన స్థితిలో నాలుగు క్షణాలు అలాగే ఉండిపోయాను.

ఆ మరునాడు సత్యం పాల పాకెట్ల కోసం వెళ్ళినపుడు వసుమతి, పిల్లల దగ్గర ఈ విషయం ప్రస్తావించాను.

వసుమతి నిట్టూర్చింది. "కృష్ణారావు గారి దగ్గర్నుంచి ఎలాగైనా వసూలు చేయాలని మొదట్లో నేనే ఆయన్ను ఒత్తిడి చేసేదాన్ని... లాభం లేదనే సంగతి తెలిశాక మాత్రం అదేం పెద్ద విషయం కాదన్నట్లుగా మర్చిపోవటమే మంచిదని నచ్చ చెప్పాను. జరిగిందేదో జరిగిపోయింది. ఆయన ఆ ఆలోచనలతో మనసు పాడుచేసుకోకుండా, ఆరోగ్యంగా, ధైర్యంగా ఉంటే అదే చాలనిపించింది".

సత్యం కొడుకు బాబీ కూడా అదే అన్నాడు "అవును బాబాయ్, నాన్నగారి ఆరోగ్యమే ముఖ్యమని ఇక ఇంట్లో ఆ ప్రస్తావనే రాకుండా చూసుకున్నాం. ఇప్పుడు మా ఇద్దరి కోరికా ఒక్కటే... మేం ఉద్యోగాల్లో స్థిరపడి అమ్మా నాన్నల కోసం అన్ని వసతులతో మంచి ఇల్లు కట్టించాలని. దానికోసం మేం ఎంతైనా ఆనందంగా శ్రమపడతాం".

అమ్మాయి నీలిమ మాట కూడా అదే!

"అమ్మా నాన్నా నా పెళ్ళి గురించి ఆలోచనలు చేస్తోంటే ఇప్పట్లో ఆ ప్రసక్తే తీసుకురావద్దని నేనూ కచ్చితంగా చెప్పేశాను బాబాయ్. మంచి ఉద్యోగంలో స్థిరపడటానికి ప్రయత్నం చేస్తానంతే" అంది.

భవిష్యత్తుపట్ల వాళ్లకున్న నమ్మకానికీ ఆత్మవిశ్వాసానికీ నాకు ముచ్చటేసింది.

రెండు రోజులు వాళ్లందరితో సరదాగా గడిపి తిరుగు ప్రయాణమయ్యాను. వాళ్ళకి ధైర్యం చెప్పి సహాయం చేయాలని అనుకున్నానుగానీ, ఆ అవసరం లేదని అర్థమైంది. సత్యంలో మునుపటి హుషారు, ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు... అలాగే ఉన్నాయి. జరిగిపోయిన ఆర్థిక నష్టం గురించి తమని తాముగానీ ఇంకెవరినైనాగానీ నిందిస్తూ కూర్చోకుండా, బాధపడకుండా ఆ పరిస్థితిని అధిగమించటానికి అందరూ కలిసికట్టుగా ఆనందంగా శ్రమిస్తున్నారు. నాకు చాలా సంతోషంగా అనిపించింది. మనసు తేలికైంది.

భవిష్యత్తు పట్ల ఆశావహ దృక్పథం ఉన్నవాళ్ళు ఎటువంటి పరిస్థితుల్లోనైనా బెంబేలు పడకుండా బలంగా నిలబడగలరు!

అంతేకాదు, వాళ్ళింట్లో ఉన్న రెండు రోజుల్లో నేను ఇంకో విషయం కూడా నేర్చుకున్నాను.

మనకు నిజమైన ఆనందాన్ని కలిగించేది ఇంటి అలంకరణే కాదు, ఇంట్లో వాళ్ళమధ్య ఉండే సామరస్య వాతావరణమే! ఇంటిని అందంగా తీర్చిదిద్దటం కోసం పెయింటింగ్స్, ఫర్నీచర్ అంటూ హైరానా పడతాంగానీ ఆనందాన్నిచ్చే అసలైన విషయం పట్ల మాత్రం చాలామందికి శ్రద్ధ ఉండదు! అందుకు నేనే ఒక ఉదాహరణ !

ఆహ్లాదకర సంభాషణ మనసులో ఉల్లాసాన్నీ, ఉత్సాహాన్నీ నింపుతుంది! నేను మనసులోనే ఒక గట్టి నిర్ణయం తీసుకున్నాను... ఇంట్లో మా మధ్య తరుచూ తలెత్తే ఎత్తిపొడుపులు, వ్యంగ్యోక్తులకు ఇక స్వస్తి పలకాలని !

నేను ఇంటికి రాగానే ఎదురొచ్చిన సుగుణ లోపలికి వచ్చి కూర్చున్నాక “సత్యంగారూ వాళ్ళు ఎలా ఉన్నారు? డబ్బా... అదీ ఏమైనా సహాయం కావాలని అన్నారా?” అంటూ ప్రశ్నలు మొదలు పెట్టింది.

“బావున్నారు. వాళ్ళకి ఎవరి సహాయం అవసరం లేదులే”.

“అదేమిటీ... మనకు తెలిసిన సంగతులు. ఇల్లూ అదీ అమ్మేయటం నిజం కాదా” ఆశ్చర్యంగా అడిగింది.

“కట్టించుకున్న ఇల్లు అమ్మేశారు నిజమే! కానీ వాళ్లు నిర్మించుకున్నది వాళ్ళతోనే ఉంటుందిగా, ఆ ఇల్లే ఓ ఖజానా!”

“ఏమిటలా అర్థంకాకుండా మాట్లాడటం. ఏదీ సవ్యంగా చెప్పరుగా” సుగుణ చిరాకుపడింది.

ఇంకొకసారైతే నాకూ చిరాకు వచ్చేది. ‘అవును... సవ్యంగా మాట్లాడటం నీకు మాత్రమే తెలిసిన విద్య. అవునా?’ అంటూ మొదలు పెట్టే వాడినే. కానీ ఆ రోజే తీసుకున్న నిర్ణయం వల్ల నిగ్రహించుకున్నాను.

అక్కడే ఉన్న మా రెండోవాడు “ఏమిటి నాన్నా, వాళ్ళిల్లు ఖజానా అంటున్నావేమిటి?” అనడిగాడు ప్రశ్నార్థకంగా మొహం పెట్టి.

కాలేజీ రోజుల్లో నాలో ఉండే కవితావేశం ఆ క్షణం మళ్ళీ ఉబికి వచ్చింది. వాడివేపు చిరునవ్వుతో చూసి చెప్పాను.

“నవ్వు... నరుడికి నారాయణుడిచ్చిన నజరానా!

నవ్వులు పండే ఇల్లే నిండు ఖజానా!”

ఈనాడు ఆదివారం. 20, జనవరి 2008